51.50 కోట్లతో దేవరకొండ మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నర్సింహ

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 27 : దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో మంగళవా రం మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.51.50 కోట్లకు ఆమోదించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నర్సింహ, కమిషనర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది ప్రశాంతి, రాజాబాబు, పద్మ, రాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ జాఫర్, అంజయ్య పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

• మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

హాలియా, ఫిబ్రవరి 27: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల భగత్ కుమార్ కోరారు. మండలంలోని మారెపల్లి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏటా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా 10 రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, ఈఓ ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్ మట్టపల్లి వెంకన్న, తాజా మాజీ సర్పంచులు గుండెబోయిన వెంకన్న, మజ్జిగపు వెంకట్రాంరెడ్డి, ధర్మారెడ్డి, శ్రీకాంత్, సురభి రాంబాబు, లింగయ్య, యాదయ్య, నవీన్ తదితరులున్నారు.


హాలియా : మారెపల్లి రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

పరీక్షలు అంటే ఆందోళన తవద్దు

• జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిశ్రీనివాస్

విద్యార్థులకు శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్

నీలగిరి, ఫిబ్రవరి 27: పరీక్షలు అంటే విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశ్నను క్షుప్తంగా చదివి జవాబులు రాయాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ క్యాంపస్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వపరంగా కార్పొరేట్ కళాశాల్లో ఉచితంగా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే పదో తరగతి మొదటి పునాది రాయి అని అన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్‌లు, కాంబాక్స్, పెన్నులు, స్కేల్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ డేగ స్వామి, వార్డెన్లు ఆర్.నిర్మల, సత్యవతి, ఎస్.విజయలక్ష్మి, సత్యనారాయణ, లింగయ్య,యాదగిరి, తహసిన్, నాగమ్మ, సౌజన్య, రాములు, గీత ఉన్నారు.

శివనేనిగూడెం మత్స్య సొసైటీ అధ్యక్షుడిగా సైదులు

ఎన్నికైన వారిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

చిట్యాల, ఫిబ్రవరి 27 : శివనేనిగూడెం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా నూతి సైదులు ముదిరాజ్‌ను రెండోసారి ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో సంఘం ఉపాధ్యక్షుడిగా నూతి లింగస్వామి, కార్యదర్శులుగా నూతి పెద్ద లింగస్వామి, డైరెక్టర్లుగా నూతి రామలింగం, నూతి చంద్రయ్య, నూతి మహలింగం, నూతి శ్రీహరి, నూతి అశోక్, నూతి శ్రీనును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శరత్ కుమార్ వ్యవహరించారు. సైదులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించారు.

కాశీ శివలింగం ప్రతిష్ఠ మహోత్సవం

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 27: నల్లగొండ ఆర్టీసీ కాలనీలో గల కృష్ణ ఆలయ ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన విశ్వేశ్వర స్వామి ఆలయంలో కాశీ శివలింగం ప్రతిష్ఠాపన నిర్వహించారు. అలాగే శ్రీకాశీ విశాలాక్షీసమేత విశ్వేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడుబాల బ్రహ్మానంద శర్మ పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి

• ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఫిబ్రవరి 27 : నకిరేకల్ పట్టణంలో రూ.26 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ, మురుగు కాల్వల నిర్మాణాలు, సెంట్రల్ లైటింగ్, అసంపూర్తి పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశించారు. నకిరేకల్ పట్టణంలోని బైపాస్‌లో మంగళవారం పద్మానగర్ జంక్షన్ నుంచి ఇనుపాముల జంక్షన్ వరకు దాదాపు 4.2 కి.మీ మేర రోడ్డు విస్తరణ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కనకదుర్గమ్మ గుడి వద్ద అసంపూర్తిగా ఉన్న టైల్స్ నిర్మాణం చేపట్టాలని, రోడ్డు విస్తరణకు ఇబ్బందిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ పోల్స్‌ను సరిచేయాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా విస్తరణ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. బాలయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ, ఏఈ గౌతమ్‌రాజ్, కౌన్సిలర్లు గాజుల సుకన్య, గడ్డం స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, చౌగోని శ్రీనివాస్, నాయకులు రాఘవరెడ్డి, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

• నిడమనూరు మండల సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

నిడమనూరు, ఫిబ్రవరి 27 : భూగర్భ జలాలు పడిపోతున్నందున గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్సీ ఎం.సీ కోటిరెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బొల్లం జయమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వేసవికి ముందే భూగర్భజలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున తాగు నీటి ఎద్దడికి తావు లేకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీలున్నందున సమన్వయంతో పని చేయాలని కోరారు. తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అంతకు ముందు ఎర్రబెల్లి ఎంపీటీసీ మొల్క సుగుణ మార్చి 25 న ఎర్రబెల్లి లింగమంతుల స్వామి జాతర నేపథ్యంలో తాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు చొరవ చూపాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ పరిసర గ్రామాల నుంచి ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేసి భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు.

సమావేశంలో అధికారుల హాజరు శాతం సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు లేఖలు రాయాలని సూచించారు. అనంతరం తొలిసారి సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీని పూల మాల, శాలువాతో సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ నందికొండ రామేశ్వరీమట్టా రెడ్డి, వైస్ ఎంపీపీ బైరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ గుర్రం వెంకటేశం, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీ.రామారావు, ఏఈ వరలక్ష్మి, మార్కెట్ కమిటీ కార్యదర్శి టి.చందర్‌రావు, ఎంఈఓ బాలూనాయక్, ఏఓ మున్నికృష్ణయ్య, ఏపీఎం శ్రీనయ్య, ఎంపీటీసీ లు చింతమల్ల ప్రమీలవెంకన్న, విశ్వనాథుల రాణీరమేశ్, నన్నెబోయిన సైదమ్మసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

త్రిపురారం, ఫిబ్రవరి 27: ప్రపంచ ఎన్జీఓ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇస్లాపత్ తండాలో గల శ్రీ గణపతి అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పేద విద్యార్థులకు బంజారా మహిళా ఎన్జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్, హరిప్రియ నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో సుజాత, చినగోపాల్, గోవింద్ పాల్గొన్నారు

పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు వచ్చేలా చర్యలు : ఎస్ఈ

త్రిపురారం, ఫిబ్రవరి 27: ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని నల్లగొండ మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలోఉన్న నాలుగు మంగళవారం మిషన్ భగీరథ ట్యాంకులను ఆయన పరిశీలించారు. ట్యాంకులన్నీ త్వరగా శుభ్రం చేసి, లీకేజీలన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వారం రోజుల్లో అన్ని బజారులకు, ప్రతి ఇంటికీ నీరు వచ్చే విధంగా చూడాలన్నారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు వస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ మధు, ఏఈ మోహన్‌గాంధీ ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

• ఎంపీపీ భగవాన్‌నాయక్

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 27: రానున్న వేసవిలో మండలంలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డాక్టర్ల సూచన మేరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గత సంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు నామమాత్రంగా ఉండడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయని, తద్వారా గ్రామాల్లో నీటి సమస్య ఉంటుందని, ఏ గ్రామాల్లో ఎక్కువ తాగునీటి సమస్య ఉంటుందో ఆ గ్రామాలను ముందుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బకాయిలతో నిమిత్తం లేకుండా గృహజ్యోతి వర్తింపచేయాలని వినతి

నిడమనూరు, ఫిబ్రవరి 27 : పాత బకాయిలతో సంబంధం లేకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గృహజ్యోతి పథకాన్ని వర్తింప చేయాలని కోరుతూ నాయబ్ తాసీల్దార్ ఎం.ఎ.రషీద్‌కు ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు గన్నెపాక లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు ఉన్న దళిత, గిరిజనులకు పథకం వర్తించదంటూ అధికారులు చెప్తుండటంతో ఆందోళనకు గురవుతున్నారన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం మండలాధ్యక్షుడు విజమూరి కరుణాకర్, పెరుమాళ్ల మట్టయ్య, బొజ్జ శ్రీను, ఆది మల్ల ఎల్లయ్య, కొమ్ము కిరణ్ తదితరులున్నారు.

స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి చెస్ టోర్నమెంట్

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 27: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, నెహ్రూ యువ కేంద్రం నల్లగొండ సౌజన్యంతో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో డివిజన్ స్థాయి క్యారమ్స్, చెస్ పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ప్రవీణ్‌సింగ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రీడాకారులకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తాళ్ల శ్రీధర్‌గౌడ్, కృష్ణకిశోర్, నిరంజన్, ఉమా మహేశ్, భాస్కర్‌రెడ్డి, సురేశ్, ఆంజనేయులు, రామకృష్ణ, రాజు, రమేశ్, కొండల్, శ్రీను పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఢిల్లీలో రైతులపై కాల్పులను నిరసిస్తూ సీపీఎం ప్రదర్శన

నల్ల బ్యానర్‌తో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల, ఫిబ్రవరి 27 : ఢిల్లీలో రైతులపై కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరుపడాన్ని నిరసిస్తూ చిట్యాలలో మంగళవారం సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యానర్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ మాట్లాడుతూ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నుంచి భారత్ బయటకు రావాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లడే రాములు, శీలా రాజయ్య, గుడిసె లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నారబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ తెలంగాణ సభ్యత్వ నమోదు

సభ్యత్వాలు అందజేస్తున్న పీఆర్‌టీయు తెలంగాణ నాయకులు

చిట్యాల, ఫిబ్రవరి 27 : పీఆర్టీయూ తెలంగాణ సభ్యత్వ నమోదును మండలంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు బాల్ రెడ్డి, కొడిదల శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనిపాకల, చిట్యాల, ఉరుమడ్ల, నేరేడ పాఠశాలలోని చాలా మంది ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. సంఘం మండలాధ్యక్షుడు రాపోలు శ్రీనివాసులు మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులకు వృత్తి లో 20 రకాలుగా ఉపయోగపడే సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషట్ అధ్యక్షుడు ఇమామ్ కరీం, మణిరాజు, లింగాచారి, ఎస్‌కే లతీఫ్ పాల్గొన్నారు.

గోగువారిగూడెంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు షురూ

మిర్యాలగూడ రూరల్ : గోగువారిగూడెంలో కనకదుర్గఅమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం పూజల్లో పాల్గొన్న భక్తులు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 27 : మండలంలోని గోగువారిగూడెంలో నిర్మించిన కనకదుర్గ,మహాలక్ష్మి, సరస్వతీ, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, ముత్యాలమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి .రూ.1.5 కోట్లతో గ్రామస్తులు, ఆలయ కమిటీ విరాళాలతో ఆలయాల సముదాయాన్ని నిర్మించారు. వేడుక నిర్వహణకు కావాల్సి యాగశాల, చలువపందిళ్లు ఆలయ కమిటీ ఏర్పా టు చేసింది. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ వేదపండితులు తాటిపాముల నర్సింహమూర్తి, పుల్లాభట్ల శివరామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో మొదటి రోజు యాగం చేశారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం

తిప్పర్తి: పజ్జూరులో బ్రాహ్మణ ఎల్లమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న జడ్పీటీసీ రాందెడ్డి

తిప్పర్తి, ఫిబ్రవరి 27: మండలంలోని పజ్జూరు గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ఎంపీపీవిజయలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ పాశం రాంరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉత్సవాలు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ఆలయ నిర్వాహకులు సింగిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటామన్నారు. కార్యక్రమంలో పాశం సంపత్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, సింగిరికొండ శ్రీనివాస్, రాగి మురళి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎల్లుండి నుంచి నల్లగొండ ఆర్యసమాజ్‌లో శతాబ్ది ఉత్సవాలు

కరపత్రాలను ఆర్యసమాజ్ కమిటీ సభ్యులు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 27: జిల్లా కేంద్రంలోని రామగిరిలో ఆర్య సమాజ్ ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చే నెల 1 నుంచి 3 వరకు ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు దయానంద సరస్వతి దీ్వశత జయంతి మహోసభలు నిర్వహించేందుకు ఆర్య సమాజ్ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మహా సభలకు స్వామి రామ్‌దేవ్ బాబా, స్వామి ప్రణవానంద సరస్వతి, స్వామి అగ్నివేశ్, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు సత్యనారాయణ హాజరుకానున్నారు. మహా సభ సందర్భంగా శతాబ్ది ఉత్సవాల కరపత్రాలను స్థానిక ఆర్యసమాజ్ సభ్యులు ఆవిష్కరించారు.

2న మహాసభలు, 3న ఉదయం 9 గంటలకు ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొనున్నట్లు ఆర్యసమాజ్ అధ్యక్షుడు బోయిన పల్లి కృష్ణారెడ్డి తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

• మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్
• 72.52 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 27 : మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.72.52 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా కార్యవర్గం ఆమోదం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.72.52 కోట్లు బడ్జెట్ ఆమోదం తెలుపగా అదే సమానంగా వ్యయాన్ని చూపించారు. పట్టణంలో సుమారు 22 వేల గృహాలు, 2,147 వ్యాపార భవనాలు, 1,588 మిశ్రమ భవనాలు ఉన్నాయని వీటి ద్వారా రూ. 9.33 కోట్లు ఆస్తి పన్ను వసూలు అవుతాయని అంచనా వేశారు. నాన్‌టాక్స్ రూపంలో రూ.10.51 కోట్లు, డిపాజిట్ల ద్వారా రూ. 33 లక్షలు మొత్తంగా 20.17 కోట్లు ఆదాయం వస్తున్నట్లు చూపించారు. ప్రధానంగా వేతనాల కోసం రూ 9.62 కోట్లు, గ్రీనరీ నిర్వహణ కోసం, కరెంట్ ఇతర చార్జీల కింద 15.16 కోట్లు ఖర్చువుతుందని చూపారు. వీటితో పాటు అదనంగా ప్రతి ఏడాది రూ.1.34 కోట్లు జనరల్‌ఫండ్ ద్వారా ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ తెలిపారు. కాగా రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. ప్రధానంగా నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న వార్డుల్లో ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భార్గవ్ మాట్లాడుతూ నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చెరువు పూడికతీత పనుల పరిశీలన

మునుగోడు పెద్ద చెర్వులో పూడికతీత పనులు పరిశీలిస్తున్న డీఆర్డీఓ నాగిరెడ్డి

మునుగోడు, ఫిబ్రవరి27 : మేట వేసుకుపోయిన చెర్వుల్లో పూడికతీత పనులు చేపట్టడం ద్వారా నీటి నిల్వసామర్థ్యం పెరిగి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుదని డీఆర్డీఓ నాగిరెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం కింద మండల కేంద్రంలో పెద్దచెర్వులో చేపట్టిన చెరువు పూడికతీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బంది, కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీని పరిశీలించారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై నిర్వాహకులు పలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మొక్కలు ఎండి పోకుండా వన నర్సరీ పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు పోసి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనుయ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నిడమనూర్‌లో ఇంటి పన్నుల వసూళ్లలో అక్రమాలు

• బిల్ కలెక్టర్‌పై చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

నీలగిరి, ఫిబ్రవరి 27 : నిడమనూర్ గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అక్రమాలకు కారణమైన తాత్కాలిక బిల్ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీలో తాత్కాలిక పద్ధతిలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి నకిలీ రశీదులు సృష్టించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నా రు. రశీదు పుస్తకాలతో ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల డబ్బులను ఎస్‌టీఓలోని గ్రామ పంచాయతీ అకౌంట్‌లోకి జమ చేయకుండా పక్కదారి పట్టిస్తున్నట్లు వివరించారు.

గ్రామ పంచాయతీ పరిధిలోని పలు నిర్మాణాల అనుమతులకు కూడా తన నకిలీ పుస్తకాల నుంచి రశీదులు ఇస్తున్నారని, గ్రామ పంచాయతీ సిబ్బందిని తన ఇంటి పన్నుల కోసం వాడుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న తాత్కాలిక బిల్ కలెక్టర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

అవగాహన కల్పించేందుకే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

• ఎస్‌బీఐ డీజీఎం ప్రశాంత్ కుమార్ బారియా